ప్రతిపాదిత ఇసుక త్రవ్వకాల ప్రాజెక్టు వలన కలుగు పర్యావరణ
పరిణామాలపై

ప్రజాభిప్రాయ సేకరణ

స్థలం ః కుదురుపల్లి మరియు బీరసాగర్ గ్రామములు
మహదేవపూర్ మండలం,
కరీంనగర్ జిల్లా (ఆంధ్రప్రదేశ్)

# ప్రాజెక్టు పర్యావరణ పర్యవేక్షణ ప్రణాళిక యొక్క సంగ్రహా నివేదిక

పర్యావరణ విభాగము
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్
(ప్రభుత్వ సంస్థ)
కొత్తగూడెం - 507 101
ఖమ్మం జిల్లా, ఆం.ప్ర.

జూన్ - 2011

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1.0 | ఉపోద్ఘాతము | 1 |
| 1.1 | ప్రాజెక్టు యొక్క ఆవశ్యకత | 1 |
| 2.0 | ప్రాజెక్టు సంబంధిత ముఖ్య వివరములు | 2 |
| 2.1 | ఈ ప్రాజెక్టు లో నిర్వహించు ముఖ్య కార్యకలాపాలు | 2 |
| 3.0 | ప్రాజెక్టు పరిసరాలలో ప్రస్తుత పర్యావరణ స్థితిగతులు | 3 |
| 4.0 | ప్రాజెక్టు వలన పర్యావరణము పై ప్రభావము మరియు నియంత్రణ చర్యలు - | 3 |
| 4.1 | వాయు కాలుష్యము మరియు నియంత్రణ చర్యలు | 3 |
| 4.2 | శబ్ధ కాలుష్యము మరియు నియంత్రణ చర్యలు | 4 |
| 4.3 | నీటి కాలుష్యము మరియు నియంత్రణ చర్యలు | 5 |
| 4.4 | ప్రాజెక్టు ప్రదేశము యొక్క నైసర్గిక మరియు ఉపరితల పరిస్థితులు | 6 |
| 4.5 | సామాజిక ఆర్థిక స్థితిగతులపై ఈ ప్రాజెక్టు యొక్క ప్రభావము | 6 |
| 5.0 | ప్రాజెక్టు కొరకు జరిపిన ప్రత్యేక అధ్యయనములు | 7 |
| 6.0 | పర్యావరణ యాజమాన్య ప్రణాళిక మరియు పర్యవేక్షణ | 7 |
| 7.0 | ప్రాజెక్టు వలన కలుగు ప్రయోజనాలు | 8 |
| 8.0 | పర్యావరణ పరిరక్షణ కొరకు కేటాయించిన ఆర్థిక వనరులు | 8 |

# సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌చే ప్రతిపాదించబడిన ఇసుక త్రవ్వకాల ప్రాజెక్టు పర్యావరణ పర్యవేక్షణ ప్రణాళిక యొక్క సంగ్రహ నివేదిక

## 1.0 ఉపోద్ఘాతము

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, దక్షిణ భారత దేశములో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న ఏకైక కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి సంస్థ. ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వాటా 51 శాతం ఉండగా కేంద్ర ప్రభుత్వ వాటా 49 శాతం ఉంది. సింగరేణి బొగ్గు నిల్వలు ఆంధ్రప్రదేశ్ లోని ప్రాణహిత గోదావరి లోయలో 350 కి.మీ మేర వ్యాపించి మరియు 8791 మిలియన్ టన్నుల భూగర్భ బొగ్గు నిల్వలు కలవని అంచనా. సింగరేణి సంస్థ ప్రస్తుతం 14 ఉపరితల బొగ్గు గనులు మరియు 36 భూగర్భ గనులతో బొగ్గు త్రవ్వకాలను నాలుగు జిల్లాలలో విస్తరించి 67,578 మంది కార్మికులతో నడుస్తూ, ఈ సంస్థ 2010-11 సంవత్సరంలో 51.33 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిపింది. మరియు 2011-12 సంవత్సర ఉత్పత్తి లక్షం 52.20 మి.టన్నులు.

## 1.1 ప్రాజెక్టు యొక్క ఆవశ్యకత

ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు గోదావరి నది తీరములో ఉండి సాలీనా 12.5 లక్షల ఘనపు మీటర్ల ఇసుకను త్రవ్వటానికి ప్రతిపాదించటమైనది. ఈ ప్రాజెక్టు జీవిత కాలం 20 సంవత్సరాలు. సింగరేణి కాలరీస్‌కు సంబంధించిన భూపాలపల్లి ఏరియాలో 5 భూగర్భ గనులలో బొగ్గు ఉత్పత్తి జరుగుచున్నది. భూగర్భ గనుల నుండి బొగ్గును వెలికి తీయడం వలన ఏర్పడిన శూన్య ప్రదేశాల కారణంగా గని ఉపరితల పర్యావరణము అనగా గని ఉపరితలము మీద ఉన్నటువంటి కట్టడాలు మొదలగునవి దెబ్బతినకుండా కాపాడటం కోసం భూగర్భ గని నుండి బొగ్గు తీయడం వలన ఏర్పడిన ఖాళీ ప్రదేశంలో తిరిగి ఇసుకను నింపవలెనను, నిబంధనలు గనుల చట్టం 1952 కు అనుగుణంగా తయారుచేయబడిన కోల్ మైన్స్ రెగ్యులేషన్ 1957 లో పొందుపరుచబడినది. బొగ్గు గనుల చట్టం 1952లో పొందుపరచబడిన నింబందనలను పాటించుట కొరకు గోదావరి నది తీరము నుండి ఇసుకను త్రవ్వి భూగర్భ గనిలో బొగ్గు తీయగా ఏర్పడిన ఖాళీ ప్రదేశంలో నింపవలసిన ఆవశ్యకత ఏర్పడినది.

## 2.0 ప్రాజెక్టు సంబంధిత ముఖ్య వివరములు

సింగరేణి సంస్థ కరీంనగర్ జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని కుదురుపల్లి మరియు బీరసాగర్ గ్రామముల సమీపంలో ఉన్నటువంటి గోదావరి తీరము నుండి ఇసుక త్రవ్వకాలను జరుపుటకు ప్రతిపాదించుచున్నది. ఈ ప్రాజెక్టు నుండి సాలీన

12.5 లక్షల ఘనపు మీటర్ల ఇసుకను 20 సంవత్సరముల వరకు 208.80 హేక్టేర్ల విస్తీర్ణముగల ప్రదేశమునుండి తీయుటకు నిర్ణయించబడినది.ప్రస్తుతం ఇసుక తీయుటకు ప్రతిపాదించిన స్థలములో సరాసరి 13.5 మీటర్ల మందముగల ఇసుక పొరలున్నవి.

గోదావరి నది తీర ప్రాంతంలో ఇసుక త్రవ్వకాలు జరుపు ప్రదేశమును సూచించు పటమును పొందుపరచడమైనది.

ప్రాజెక్టు కొరకు భూమి వినియోగం (హేక్టేర్లలో)

| జిల్లా మరియు రాష్ట్రం | గ్రామము | మండలం | భూమి | భూమి యాజమాన్యం |
|---|---|---|---|---|
| కరీంనగర్, ఆంధ్రప్రదేశ్ | కుదురుపల్లి మరియు బీరసాగర్ | మహదేవపూర్ | 208.80 | ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం |

### 2.1 ఈ ప్రాజెక్టు లో నిర్వహించు ముఖ్య కార్యకలాపాలు

ఈ ప్రాజెక్టు నుండి ఇసుకను వెలికి తీయుటకు షావల్ యంత్రములు మరియు రవాణా చేయుటకు లారీలు ఉపయోగించబడును.ఇసుక త్రవ్వకాలు ప్రారంభించడానికి ముందు ఆ ప్రదేశంలో నీరు చల్లి దుమ్ము లేవకుండా చర్యలు తీసుకుని తరువాత ఇసుకను షావల్ తో లారీలలో నింపి భూపాలపల్లి ఏరియాలోని బొగ్గు గనుల ఇసుక బంకర్ల దగ్గరకు రవాణా చేయటం జరుగుతుంది. ఆ తరువాత ఇసుకను గనులలోని బొగ్గు తొలగించిన ప్రదేశానికి పైపుల ద్వారా నీటి ప్రవాహం తో కలిపి పంపించి, నింపటం జరుగుతుంది.

ఈ ప్రాజెక్టు లోని ఇసుక త్రవ్వకం కార్యాకలాపాలు ఆంధ్రప్రదేశ్ నీరు, భూమి, చెట్లు చట్టం 2002 మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూగర్భ జలశాఖ వారు నిర్ధేశించిన వివిధ నిబంధనల ప్రకారము మరియు ఈ ప్రాజెక్టులో పనిచేయు సిబ్బంది భద్రత, ఆరోగ్యము మరియు సంక్షేమము దృష్టిలో ఉంచుకొని నిర్వహించబడును. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి మరియు కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వశాఖ పర్యావరణ పరిరక్షణ నిమిత్తం నిర్దేశించిన నిబంధనలను కూడా ఈ ప్రాజెక్టులో అమలు చేయడము జరుగుతుంది.

## 3.0 ప్రాజెక్టు పరిసరాలలో ప్రస్తుత పర్యావరణ స్థితిగతులు

ప్రాజెక్టు నిర్దేశిత స్థలం చుట్టూ పది కిలోమీటర్ల వ్యాసార్థంలో గల ప్రాంతంలో ప్రస్తుత పర్యావరణ స్థితిగతులను డిశంబరు 2009 నుండి ఫిబ్రవరి 2010 మధ్య కాలంలో అంచనా వేయడం జరిగింది. ప్రాజెక్టు ప్రాంతంలో పర్యావరణ పరిస్థితులు కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వశాఖ నిబంధనల కనుగుణంగా అంచనా వేయబడినది. గాలి, నీరు, శబ్ద మరియు భూసార ప్రాథమిక సర్వే నిర్వహించగా ఈ అంశాలకు సంబంధించిన ప్రామాణికాలు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖచే నిర్దేశించిన పరిమితులకు లోబడి ఉన్నాయని నిర్ధారణ అయినది.

## 4.0 ప్రాజెక్టు వలన పర్యావరణము పై ప్రభావము మరియు నియంత్రణ చర్యలు

ఈ ప్రాజెక్టు ప్రాంతంలో ప్రస్తుత పర్యావరణ స్థితిని తెలిసికొనుటకు గాలి, నీరు, శబ్దము మరియు భూసార ప్రాథమిక సర్వే నిర్వహించి ప్రతిపాదిత ప్రాజెక్టు వలన పర్యావరణముపై కలుగు ప్రభావమును అంచనా వేయటం జరిగింది. మరియు కాలుష్య నివారణ మరియు పర్యావరణ పరిరక్షణకు గాను చేపట్టు వివిధ చర్యలతో కూడిన నిర్దిష్ట ప్రణాళికను తయారు చేయడం అయినది. దీనిలోని ముఖ్యాంశాలు ఈ క్రింద వివరించబడినవి.

### 4.1 వాయు కాలుష్యము మరియు నియంత్రణ చర్యలు

ఈ ప్రాజెక్టులో జరుపు ప్రక్రియలలో భాగంగా ఇసుక త్రవ్వకం, లారీలలో నింపటం మరియు గనులకు రవాణా చేయుటకు ఉపయోగించు భారీ వాహనముల వలన వెలువడు ధూళి, వ్యర్థ వాయువులచే వాయు కాలుష్యం ఏర్పడుతుంది. వాయు కాలుష్యం నివారించుటకు ఈ క్రింద పేర్కొన్న విధముగా వివిధ చర్యలు చేపట్టబడును.

- ఇసుక త్రవ్వక ప్రక్రియలో ధూళి ఉత్పత్తి కాకుండా మరియు విస్తరించకుండా ఇసుక త్రవ్వే ప్రదేశంలో నీటిని చల్లిన తరువాతనే ఇసుక త్రవ్వడం మరియు లారీలలో నింపడం జరుగుతుంది.

- ఇసుక రవాణా చేయు రోడ్లపై నిరంతరం నీటిని చల్లడం ద్వారా ధూళిని నివారించడం జరుగుతుంది. దీని కొరకు ప్రత్యేకంగా ఒక 3 కి.లీ సామర్థ్యం గల నీటి వాటర్ స్ప్రింక్లర్‌ను ఉపయోగించటం జరుగుతుంది.

- ఇసుకను స్క్రీనింగ్ చేసే సమయంలో దుమ్ము గాలిలోకి విస్తరించకుండా ఉండుటకు గాను గనుల వద్దనే ఈ ఏర్పాటు చేయటం జరుగుతుంది.
- గనిలో ఇసుక నిల్వచేసే బంకర్ల దగ్గర నీటిని చల్లడం ద్వారా ధూళిని నివారించడం జరుగుతుంది.
- షావల్ యంత్రములు మరియు గనులకు ఇసుక రవాణా జరుపు లారీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి కావలసిన మరమత్తులు చేపట్టడం ద్వారా వాయు కాలుష్యాన్ని నివారించడం జరుగుతుంది.
- ఇసుక రవాణా చేసే సమయంలో లారీలపై టార్పాలిన్ కప్పి దుమ్ము వ్యాపించకుండా నివారించటం జరుగుతుంది.
- ఇసుక రవాణా వలన దుమ్ము వెలువకుండా గోదావరి గట్టు నుండి భూగర్భ గని వరకు తారు రోడ్డు (ASPHALT) నిర్మాణం చేపట్టి దుమ్ము వ్యాపించకుండా నివారించటం జరుగుతుంది.
- ఇసుక త్రవ్వే ప్రదేశము మరియు పరిసర ప్రాంతాలలో గాలి కాలుష్య పరిమాణాన్ని 15 రోజులకొకసారి పరీక్షించి తగిన నివారణ చర్యలు తీసుకోవటం జరుగుతుంది.
- ఇసుక రవాణా చేయు రహదారులు, గని ఆవరణలో మరియు ఇసుక త్రవ్వే పరిసర ప్రాంతములలో చెట్లను పెంచడం జరుగుతుంది

## 4.2 శబ్ధ కాలుష్యము మరియు నియంత్రణ చర్యలుః

ఈ ప్రాజెక్టును ఇసుక త్రవ్వి తీయడం కొరకు ప్రతిపాదించబడినది. ఎటువంటి పేలుడు పదార్థములు ఈ ప్రాజెక్టులో ఉపయోగించరు కనుక ఎటువంటి శబ్ద కాలుష్యం ఏర్పడదు. ఈ ప్రాంతములో షావల్ మరియు ఇసుక రవాణా చేయు లారీల వలన కొంత శబ్ద కాలుష్యం సంభవించే అవకాశము కలదు. ఈ ప్రాజెక్టులో శబ్ద కాలుష్య నివారణకు ఈ క్రింద తెలిపిన చర్యలు తీసుకొనబడును.

- ఇసుక త్రవ్వకాలలో వాడు యంత్రములు మరియు వాహనములకు ఎప్పటికప్పుడు మరమత్తు చేయబడును.
- ఎక్కువ శబ్ధము ఉత్పన్నమయ్యే ప్రదేశాలలో పనిచేయు సిబ్బందికి చెవిలో అమర్చుకొను శబ్ద నిరోధక పరికరాలు సరఫరా చేయబడును.

- ఇసుక త్రవ్వే ప్రదేశము మరియు పరిసర ప్రాంతాలలో శబ్ద కాలుష్య పరిమాణాన్ని 15 రోజులకొకసారి పరీక్షించి తగిన నివారణ చర్యలు తీసుకోవటం జరుగుతుంది.

### 4.3 నీటి కాలుష్యము మరియు నియంత్రణ చర్యలుః

నది తీరము నుండి ఇసుకను త్రవ్వటం వలన నది ప్రవాహము యొక్క భౌతిక లక్షణాల మీద ప్రభావం కలిగే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు కోసం నది మరియు భూగర్బ నీటి వాడకం ఉండదు. ఇసుకను నది యొక్క ప్రవాహపు మలుపులో త్రవ్వటం వలన నీటి కాలుష్యం పై ఎటువంటి ప్రభావము ఉండదు. ఈ ప్రాజెక్టు ద్వారా నది ప్రవాహ సరళిని మళ్ళించటం లేదు మరియు ఇసుకను త్రవ్వటం వలన భూగర్భ జలాలపై ఎటువంటి ప్రభావము లేదు.

ఇసుకను త్రవ్వటం ద్వారా ఈ క్రింది చర్యలు చేపట్టి నీటి కాలుష్యాన్ని నివారించటం జరుగుతుంది.

- వర్షకాలంలో ఇసుకను త్రవ్వటం జరుగదు. ఇందువలన ఇసుక తీసిన ప్రాంతంలో తిరిగి మేట వేయుటకు అవకాశం కలుగుతుంది.
- ఇసుక త్రవ్వకం ప్రణాళిక నీటి ప్రవాహపు సరళి మరియు భూమి యొక్క వాలుకు అనుసంధానంగా చేపట్టబడును.
- ఇసుక త్రవ్వకాల ప్రక్రియ ఆంధ్రప్రదేశ్ నీరు, భూమి మరియు చెట్లు చట్టం 2002 ప్రకారము మరియు ఆంధ్రప్రదేశ్ భూగర్భ జల శాఖ సిఫారసుల ప్రకారము నిర్ణయించబడుతుంది.
- గోదావరి నది, ఇతర ఉపరితల మరియు భూగర్భ జలాల నీటి నాణ్యతను కూడ అంచనా వేయడం జరుగుతుంది.

## 4.4 ప్రాజెక్టు ప్రదేశము యొక్క నైసర్గిక మరియు ఉపరితల పరిస్థితులు

ఇసుక త్రవ్వే కార్యక్రమములలో వాహనాలు తిరుగుట వలన పరిసర ప్రాంతంలో గాలి మరియు శబ్ద కాలుష్యం కలుగుతుంది. ఇసుక త్రవ్వే కార్యక్రమములో నది తీరానికి ఏర్పరచు రోడ్డు మార్గాల వలన నది ఒడ్డుకు నష్టం కలుగుతుంది. నీటికోత మరియు నీటి ప్రవాహ మార్గం మార్పు చెందవచ్చు. ఇసుక లోపల పొరలోగల నీరు కలుషితమయ్యే అవకాశం కలదు.

- నది తీరానికి వెళ్ళుటానికి వీలయినంత తక్కువగా రోడ్లను నిర్మించి మరియు నిర్వహించటం జరుగుతుంది.
- నది ఒడ్డుకు 100 మీ. దూరములో నది తీరానికి రోడ్డు నిర్మించటం జరుగుతుంది.
- ఇసుకను త్రవ్వే కార్యక్రమములో నదీ తీరంలో గోతులు ఏర్పడకుండా చర్యలు చేపట్టబడును.
- ప్రధాన రహదారి నుండి నది ఒడ్డుకు వెళ్ళే రహదారి మార్గాన్ని, పర్యావరణ పై ప్రభావం లేకుండా నిర్మించటం జరుగుతుంది.
- ఇసుక త్రవ్వకాల ప్రదేశంలోని రహదార్లు మరియు గనుల మార్గం వెంట చెట్లను పెంచటం జరుగుతుంది. ఈ ప్రాజెక్టు పరిసర గ్రామ ప్రజలకు చెట్లను ఉచితంగా పంపిణి చెయ్యటం జరుగుతుంది.

## 4.5 సామాజిక ఆర్థిక స్థితిగతులపై ఈ ప్రాజెక్టు యొక్క ప్రభావము:

ఈ ప్రాజెక్టు ప్రారంభించడం వలన  ఈ ప్రాంత ప్రజల జీవన సరళిలో ఎటువంటి మార్పులు సంభవించవు. ఈ ప్రాజెక్టు పరిసర ప్రాంతలలో సింగరేణి కంపెనీచే అభివృద్ధి చేయబడే వివిధ మౌలిక సదుపాయములు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. నిర్మాణ కార్యక్రమాలలో, సేవలు మరియు వ్యాపార సంబంధిత వృత్తులలో స్థానికులకు పరోక్ష ఉపాధి అవకాశాలు లభ్యమవుతున్నాయి.

ఈ ప్రాజెక్టుకు అవసరమైన 208.80 హెక్టేర్ల నదీ తీరాన్ని సింగరేణి కాలరీస్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నుండి 20 సంవత్సరాల కొరకు లీజు పొందినది. ఈ ప్రదేశములో మానవ నివాస ప్రాంతాలు లేని కారణంగా పునరావాస కార్యక్రమము చేపట్టవలసిన అవసరము లేదు. ఈ ప్రాజెక్టు కొరకు పట్టా భూమి సేకరించవలసిన అవసరము లేదు.

ఈ ప్రాజెక్టు ప్రారంభించడం వలన పరిసర ప్రాంత ప్రజల ఉమ్మడి ఆస్తులపై ఎటువంటి ప్రతికూల ప్రభావము చూపించదు. ప్రస్తుతము ఇసుకను త్రవ్వడానికి ప్రతిపాదించిన స్థలమును పరిసర గ్రామాల ప్రజలు ఎటువంటి అవసరముల కొరకు వినియోగించుట లేదు.

## 5.0 ప్రాజెక్టు కొరకు జరిపిన ప్రత్యేక అధ్యయనాలు

ప్రతిపాదిత ప్రాజెక్టు వలన ఈ ప్రాంత పర్యావరణంపై కలుగు ప్రభావాన్ని అంచనా వేయుటకు గాను కొన్ని ప్రత్యేక అధ్యయనాలు చేయబడ్డాయి.

ఈ ప్రాజెక్టు వలన వృక్ష మరియు జంతు జాలాలపై  కలుగు ప్రభావం గురించి అధ్యయనం చేయబడినది.ఈ ప్రాంతంలో భూగర్భజలాల వినియోగం మరియు ఈ ప్రాజెక్టు వలన కలుగు మార్పుల గురించిన అధ్యయనం చేయబడినది. ప్రాజెక్టు ప్రారంభించిన తరువాత ధూళి కాలుష్య ప్రభావం గురించిన అధ్యయనం చేసి, వాయు కాలుష్య నివారణకు చేపట్టవలసిన చర్యలు ప్రాజెక్టు ప్రణాళికలో పొందుపరచబడినవి.

## 6.0 పర్యావరణ యాజమాన్య ప్రణాళిక మరియు పర్యవేక్షణ

ఇసుకను త్రవ్వే కార్యక్రమము వలన పర్యావరణముపై కల్గు ప్రభావము మరియు వివిధ కాలుష్య నివారణ చర్యలతో కూడిన సమగ్ర పర్యావరణ యాజమాన్య ప్రణాళికను తయారుచేయడం జరిగింది. ఈ ప్రణాళికను కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వశాఖ (MoEF) వారి నోటిఫికేషన్ నం.1533 తేది.14.09.2006 అనుసరించి ప్రభుత్వం నుండి పర్యావరణ అనుమతి పొందబడును. ప్రభుత్వ అమోదము పొందిన పర్యావరణ యాజమాన్య ప్రణాళికను ప్రాజెక్టు జీవితకాలం పొడవునా అమలు చేయబడును. కేంధ్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వశాఖ ఇచ్చిన ప్రాజెక్టు పర్యావరణ అనుమతి పత్రంలో పొందుపరచిన వివిధ నిబంధనలను పాటిస్తూ, ఉత్తర్వులు పాటింపు నివేదికను కేంద్ర ప్రభుత్వ పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖకు సమర్పించబడును.

ప్రాజెక్టు ప్రారంభం నుండి ఇసుకను త్రవ్వే కార్యకలాపాలలో భాగంగా ప్రాజెక్టు పరిసరాలలో కాలుష్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేయడం జరుగుతుంది. పర్యావరణ పర్యవేక్షణలో భాగంగా వాయు, నీరు, శబ్ద కాలుష్యము మరియు భూగర్భ జలమట్టం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ నిబంధనలననుసరించి, పరీక్షిస్తూ అవసరమైన నివారణ చర్యలు చేపట్టబడును.

## 7.0 ప్రాజెక్టు వలన కలుగు ప్రయోజనాలు

ఈ ప్రాజెక్టు ద్వారా తీసిన ఇసుకను భూపాలపల్లి ఏరియాలోని భూగర్భ గనులలో నింపటం ద్వారా కావలసినంత బొగ్గును ఉత్పత్తి చేసి బొగ్గు ఆధారిత పరిశ్రమలకు నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేయుటకు అవకాశము కలదు.

ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రజలకు సేవలు, సర్వీసులు మరియు వ్యాపార సంబంధిత వృత్తులలో పరోక్ష ఉపాధి అవకాశములు లభించును.

ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత, రాష్ట్ర మరియు దేశాభివృద్ధికి మరింత దోహదపడును.

## 8.0 పర్యావరణ పరిరక్షణకు కేటాయించిన ఆర్థిక వనరులు

ఈ ప్రాజెక్టులో పర్యావరణ పరిరక్షణ మరియు కాలుష్య నియంత్రణకై చేపట్టు వివిధ కార్యక్రమములకు ప్రత్యక్షంగా రూ. 82 లక్షలు కేటాయించడం జరిగింది. అంతే కాకుండా సాలీనా రూ. 56.69 లక్షలు ప్రతి సంవత్సరం పర్యావరణ పరిరక్షణ నిమిత్తం ఖర్చు చేయడం జరుగుతుంది. అనగా ఒక క్యూబిక్ మీటరు ఇసుక ఉత్పత్తి కయ్యే ఖర్చులో పర్యావరణ పరిరక్షణ నిమిత్తం రూ. 4.54 వెచ్చించడం జరుగుతుంది. పైన పేర్కొనబడిన కార్యచరణ ప్రణాళికను ప్రాజెక్టు పూర్తి కాలంలో అమలు చేయటం ద్వారా ఈ ప్రాంతలోని పర్యావరణాన్ని పరిరక్షించటం జరుగుతుంది.

* * * * *